సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం । 2 । జూన్ । 2024



మార్మోగిన బీచుపల్లి

బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం భక్తుల అంజన్న నామస్మరణతో మారుమోగింది.

వివరాలు 8లో ▸



ఉత్సాహంగా సర్కారి కిస్తీ

షాఅలీ పహిల్వాన్ ఉత్సవాల్లో సర్కారి కిస్తీ పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.2 /28.4

ఉదయం నుంచే ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వడగాలులు బలంగా వీస్తాయి.

● దశాబ్ది ప్రస్థానం

ప్రగతిలో పాలమూరు

విద్య, వైద్యం తదితర రంగాల్లో పెను మార్పులు

- సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట
- జిల్లాల పునర్విభజనతో పాలన చేరువ
- భారీగా పెరిగిన సాగు.. వరివైపే రైతుల మొగ్గు
- రాజకీయాంశంగానే పీఎల్ఆర్ఐ జాతీయ హోదా



కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పాలమూరు జిల్లా ప్రగతి బాటలో దూసుకెళ్తోంది. విద్య, వైద్యంతో పాటు తదితర రంగాల్లో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కింది. వలసలు, కరువుకు కేరాఫ్‌గా నిలిచిన జిల్లాలో ప్రధానంగా నీటిపారుదల, సాగురంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాలు సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేయడం, రహదారుల విస్తరణతో అనతికాలంలోనే దిశాదశ మారింది. జిల్లాల పునర్విభజనతో పాలన చేరువ కాగా.. పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు అవుతున్న సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలు, మారిన ముఖచిత్రంపై 'సాక్షి' కథనం..

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

సాగు.. బహుబాగు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఉమ్మడి పాలమూరులో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇది అతిపెద్ద మార్పుగా చెప్పవచ్చని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. 2014కు ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వానాకాలంలో అన్ని పంటలు కలిపి 9,21,350 ఎకరాల్లో సాగు కాగా.. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 21,11,977 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు యాసంగిలో 6,35,639 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయగా.. ప్రస్తుతం 11,29,888 ఎకరాల్లో సాగు చేశారు. ఈ లెక్కన వానాకాలంలో 11,90,627 ఎకరాల్లో, యాసంగిలో 4,94,249 ఎకరాల్లో సాగు పెరిగినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా వరి సాగు పెరిగింది. 2014కు ముందు వానాకాలంలో 6,33,998 ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుతం ఇదే సీజన్‌లో 16,23,410 ఎకరాల్లో సాగవుతుంది. యాసంగికి సంబంధించి గతంలో 4,56,225 ఎకరాల్లో వరి సాగు కాగా.. ప్రస్తుతం 9,66,023 ఎకరాల్లో సాగవుతున్న వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇందుకు గతంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, మిషన్ కాకతీయ వంటి పథకాలతో భూగర్భజలాలు పెరగడం సాగుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర అవతరణకు ముందు ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 2.30 లక్షల ఎకరాల మేరకు ఉన్న సాగు విస్తీర్ణం ప్రస్తుతం 5.50 లక్షల ఎకరాలకు పెరిగింది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాల్వలు, చెరువులు, కుంటల ద్వారా ఆయకట్టు విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది. అంతేకాదు రైతుబంధు పథకం, రైతు రుణమాఫీ, సమీకృత మార్కెట్లు, గోదాంల సామర్థ్యం పెంపు, ప్రభుత్వమే మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేయడం వంటి అంశాలు వ్యవసాయ సాగు రంగానికి దోహదం చేశాయి. కొడంగల్-మక్తల్-నారాయణపేట పథకానికి పెద్దపీట వేయడంతో ఆయా నియోజకవర్గాల్లో మరింత సాగు పెరిగే అవకాశం ఉంది.

10 వసంతాల తెలంగాణ

'విద్య'లో విప్లవాత్మక మార్పులు..

2014 నుంచి ఇప్పటివరకు విద్యారంగంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ 32 గురుకులాలను ఏర్పాటు చేశారు. కేజీబీవీల్లో ఎస్సెస్సీ నుంచి ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేసి అన్ని రకాల వసతులు కల్పించారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ఉమ్మడి జిల్లాలో 1,220 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పాలమూరు యూనివర్సిటీలో కొత్త కోర్సుల ఏర్పాటు, లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. బడుల్లో విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, యూనిఫాంలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది.



పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన సర్జ్‌పూల్

జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కాలేజీ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు **ఉమ్మడి జిల్లాలో** ఒక్కటంటే ఒక్క **ప్రభుత్వ వైద్య కళా**శాల లేదు. ప్రత్యేక **రాష్ట్రం ఆవిర్భావం** తర్వాత తొలుత **మహబూబ్‌నగర్‌లో** పాలమూరు **ప్రభుత్వ మెడికల్** కళాశాల ఏర్పాటైంది. **జిల్లాల పునర్విభజ**న అనంతరం నూత**నంగా ఏర్పాటైన** నాలుగు కొత్త జిల్లాల **(నాగర్‌కర్నూల్, జో**గులాంబ గద్వాల, **వనపర్తి, నారాయణ**పేట)కు ప్రభుత్వ **మెడికల్ కళాశాలలు** మంజూరయ్యాయి. **ప్రస్తుతం నాగర్‌**కర్నూల్, వనపర్తిలో **వైద్యవిద్యార్థులకు** తరగతులు ప్రారంభం కాగా, గద్వాలలో వైద్య కళాశాల నిర్మాణం పూర్తి కాగా.. ఈ అకాడమిక్ ఇయర్‌లో తరగతులు ప్రారంభం కానున్నాయి. నారాయణపేటలో సైతం ఈ ఏడాది తరగతులు ప్రారంభించేలా అధికారులు పనులు ముమ్మరం చేశారు. వనపర్తిలో రూ.540 కోట్లతో నూతన మెడికల్, నర్సింగ్, అనుబంధ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ భవనాలు, ల్యాబ్‌లు, లైబ్రరీ కోసం కోసం భవనాలను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నారాయణపేటలో నూతనంగా చిన్న పిల్లల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. వీటితో పాటు ప్రతి జిల్లాలో కిడ్నీ రోగుల సౌకర్యార్థం డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పేద రోగులకు ఉచితంగా వైద్యసేవలందుతున్నాయి.

మెరుగుపడిన రవాణా మార్గాలు..

ఉమ్మడి జిల్లాకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాతే మహబూబ్‌నగర్–రాయచూర్ ప్రధాన రహదారి విస్తరణకు నోచుకుంది. అదేవిధంగా భూత్పూర్ - చించోలి, అటు కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు జాతీయ రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటితో పాటు రైల్వే లైన్‌ల ఆధునికీకరణతో రవాణా మార్గాలు మెరుగయ్యాయి. అదేవిధంగా పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి సారించడంతో సమీకృత మార్కెట్లు, పార్కులు, ట్యాంక్‌బండ్‌లు ఏర్పాటయ్యాయి. నారాయణపేట మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో సమీకృత కలెక్టరేట్ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను సస్యశ్యామలం చేసే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా రాజకీయాంశంగా మాత్రమే మారడంపై విమర్శలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ హయాంలో కొల్లాపూర్‌లో ఒక్క పంపు మాత్రమే ప్రారంభానికి నోచుకోగా.. పనులను వెంటనే పూర్తి చేసి నీరందించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

విజేత ఎవరో..

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

- బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మరూ
- కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ మధ్యే పోరు
- సర్వత్రా ఉత్కంఠ.. ఎవరి ధీమా వారిదే..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితం నేడు వెలువడనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య నువ్వా.. నేనా అన్నట్లు పోరు కొనసాగగా.. ఆదివారం ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కౌంటింగ్ సిబ్బంది ఉదయం 6.30 గంటల వరకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయనున్నారు. 7.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి బ్యాలెట్ బాక్సులు తీసుకురానున్నారు. కౌంటింగ్ కోసం ఐదు టేబుళ్లను ఏర్పాటు చేయగా.. ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఓటు వేసినవారు 1,437 మంది..

కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి ఎన్నికైన క్రమంలో ఎమ్మెల్సీగా ఆయన రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది మార్చి 28న పోలింగ్ జరగగా.. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ పోటీలో నిలిచిన విషయం తెలిసిందే. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా.. 1,437 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంథన్‌గోడ్ ఎంపీటీసీ సభ్యురాలు సుమిత్ర, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం గుడ్లనర్వ ఎంపీటీసీ శారద ఓటు హక్కు వినియోగించుకోలేకపాయారు. తొలుత షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ ఏప్రిల్ రెండున చేపట్టాల్సి ఉంది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల కమిషన్ జూన్ రెండో తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

ఓటు వేసిన వారు ఇలా..

జెడ్పీటీసీ సభ్యులు	ఎంపీటీసీ సభ్యులు
83	886

పురపాలికల కౌన్సిలర్లు	ఎక్స్ అఫీషియో సభ్యులు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు)
449	19

మొత్తం 1,437

ఓట్ల లెక్కింపు ఇలా..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్యతా క్రమంలో ఓటర్లు ఓటు వేస్తారు. ఈ క్రమంలో మొదట ప్రారంభ లెక్కింపు చేపడతారు. ప్రారంభ లెక్కింపులో మొత్తం 10 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లు, వచ్చిన బ్యాలెట్ పేపర్లను లెక్కించనున్నారు. మొత్తం చెల్లుబాటు అయిన ఓట్ల సంఖ్య ఆధారంగా గెలుపు కోసం కావలసిన కోటాను నిర్ధారించనున్నారు. మొదటి ప్రాధాన్యత ప్రకారం ప్రతి అభ్యర్థి సాధించిన ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎవరైనా కోటాకు సరిపడా ఓట్లను సాధించినట్లయితే సదరు అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటించనున్నారు. ఏ అభ్యర్థికీ కోటాకు కావలసిన ఓట్లు రానట్లయితే ఎలిమినేషన్ పద్ధతిలో తదుపరి ప్రాధాన్యత క్రమం ఆధారంగా ఓట్ల లెక్కించనున్నారు. ఎవరైనా అభ్యర్థి కోటాను సాధించేవరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఏ అభ్యర్థికీ కోటా రానట్లయితే చివరికి మిగిలిన అభ్యర్థి గెలుపొందినట్లుగా ప్రకటించనున్నట్లు ఎన్నికల ఏర్పాట్లను శనివారం పరిశీలించిన క్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్‌తోపాటు ఏఆర్ఓ ఎస్.మోహన్‌రావు వెల్లడించారు.



మహబూబ్‌నగర్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మేమంటే.. మేమే..

గెలుపుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉప ఎన్నికను ఇరు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. ప్రచారం హోరెత్తింది. లెక్కప్రకారం స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఓటర్లు అధిక సంఖ్యలో ఉండగా.. ఆ పార్టీకే మెజార్టీ ఉంది. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడం.. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య హోరాహోరీ పోరు కొనసాగగా.. క్యాంప్ రాజకీయాలు చోటుచేసుకున్నాయి. గోవా, కర్ణాటక, ఏపీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలకు ఓటర్లను తరలించగా.. తాయిలాల పర్వం కొనసాగినట్లు వెలుగుచూసింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 12 స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఈ నేపథ్యంలో తమకే విజయావకాశాలు ఉన్నాయని ఆపార్టీలో ధీమా వ్యక్తమవుతోంది. గద్వాల, అలంపూర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండగా.. స్థానిక సంస్థలకు సంబంధించి తమ పార్టీకి చెందిన ఓటర్లే అధికంగా ఉన్నారని.. తామే గెలుస్తామని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

ప్రాధాన్యత క్రమంలో పనులు చేయాలి



మొమిన్‌మహల్లా పాఠశాల మరమ్మతు పనుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- పాఠశాలల్లో అభివృద్ధి పనుల నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం
- ఇంజినీరింగ్ అధికారికి మెమో జారీ

గద్వాల రూరల్: జిల్లాలోని ఆయా పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు ప్రాధాన్యత క్రమంలో రానున్న వర్షాకాలాన్ని.. విద్యార్థులను గుర్తించుకొని చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. శనివారం ఆయన గద్వాల పట్టణం గంజిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మొమిన్‌మహల్లా ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోమిన్‌మహల్లా పాఠశాలలో ఇంతకు ముందే టాయిలెట్స్ ఉండగా మళ్లీ ఎందుకు నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. క్లాస్ రూంల పైకప్పులు ఎందుకు మరమ్మత్తులు చేయకుండా ఉన్నారని దీనివల్ల రాబోయే వానాకాలంలో ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రతిసారి సమీక్షలో చెబుతున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవ్యహరించడం ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఈసందర్భంగా సంబంధిత ఇంజినీరింగ్ అధికారికి మెమో జారీ చేశారు. అసంపూర్తి పనులన్నింటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ విజయ్‌కుమార్, మున్సిపల్ డీఈ సందీప్, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్కూల్‌డ్రెస్‌లు అందజేయాలి

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికి సకాలంలో స్కూల్ యూనిఫాంలు అందజేయాలని కలెక్టర్ అన్నారు. గద్వాల పట్టణంలోని భీంనగర్‌లో ఉన్న కుట్టుకేంద్రాన్ని సందర్శించారు. అక్కడ స్టిచింగ్ చేస్తున్న స్కూల్‌యునిఫాంలను పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభించే నాటికే అందరికి స్కూల్ యూనిఫాంలు అందజేయాలన్నారు.కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, ఏపీడీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు నిర్లక్ష్యం వీడాలి

- రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- గద్వాల సీనియర్ సివిల్ జడ్జి కవిత



జిల్లా ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

సాక్షి ఎఫెక్ట్..

గద్వాల క్రైం: అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించాల్సిన వైద్యులు అందుబాటులో ఉండకపోవడం, వైద్య సిబ్బంది సైతం నిర్లక్ష్యం వహించడం సరికాదని గద్వాల సీనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. ఆసుపత్రిలో వైద్యం అందక రోగులు పడుతున్న ఇబ్బందులు.. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై గత వారం రోజుల నుంచి వరుస 'సాక్షి'లో వరుస కథనాలు రాగా శనివారం సాయంత్రం ఆమె జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగంలోని విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందితో రోగులకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఎంత మంది ఉన్నారు, ప్రస్తుతం ఎంత మంది సిబ్బంది ఉన్నారనే అంశాలపై రికార్డులను పరిశీలించి తెలుసుకున్నారు. 38 మంది సిబ్బంది విధుల్లో ఉండాల్సిన క్రమంలో 19 మంది వైద్యులు మాత్రమే హాజరు పట్టికలో సంతకం ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బంది వివరాలను కలెక్టర్‌కు నివేదించి శాఖపరమైన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 194 మంది ఇన్ పెషెంట్లు వైద్య సేవల కోసం వస్తే ఇక్కడ సిబ్బంది లేకపోవడం వారి నిర్లక్ష్యం వెల్లడైందన్నారు.

మందుల కొరత లేకుండా చూడాలి

ప్రైవేటు క్లినిక్‌లపై ఉన్న మక్కువ ప్రభుత్వాసుపత్రిలో కనిపించడం లేదని మండిపడ్డారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ఎలాంటి మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అత్యవసర సేవల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల ఆసుపత్రులకు రెఫర్ చేసే దుస్థితి నుంచి రోగులకు ఉపశమనం కల్గించాల్సిన బాధ్యత జిల్లా ఆసుపత్రి వైద్యులపై ఉందన్నారు. రోగులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయలన్నారు. ఎప్పటికప్పుడు పరిశరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఇంచార్జ్ సూపరిండెంట్ నవీన్‌క్రాంతి, ఆర్ఎం వృశాలీతో ఇక్కడి వైద్యుల తీరుపై నివేదికలను అందజేయాలన్నారు. ఇదిలాఉండగా, జడ్జి తనిఖీలు చేపట్టిన క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బయటపడిందని, ఏళ్ల తరబడి ఇక్కడి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు రోగుల బంధువులు పేర్కొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకలకు ముస్తాబు



త్రివర్ణ కాంతులతో గద్వాలలోని కోట

గద్వాల రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఆదివారం నిరాడంబరంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. లోక్‌సభకు సంబంధించి ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఎక్కడా రాజకీయాలకు తావివ్వకుండా అవతరణ వేడుకలు నిర్వహించేందుకు కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో విధిగా జాతీయ పతాకావిష్కరణ చేయాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు అవతరణ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆదివారం జరిగే కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 8:20కి కలెక్టర్ బీఎం సంతోష్ స్మృతి వనం వద్ద అమరవీరుల స్మారక స్థూపానికి పుష్పగుచ్ఛాలతో నివాళి
- 8:55కి కలెక్టర్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌తోపాటు పలువురి చిత్రపటాలకు పుష్పమాలంకరణ
- 9:00కి కలెక్టరేట్ వద్ద కలెక్టర్ బీఎం సంతోష్ చేత జాతీయ పతాకావిష్కరణ, వందన స్వీకారం, పోలీసు కవాతు
- 9:10కి ముఖ్యఅతిథి సందేశం
- 9:20కి సమరయోధులు మరియు తెలంగాణ అమర వీరుల కుటుంబ సభ్యులకు సన్మానం
- 9:30కి సాంస్కృతిక కార్యక్రమాలు ఉదయం 10:00 గంటలకు కలెక్టరేట్‌లో తేనేటి విందు

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

గద్వాల : ఘల్లుఘల్లుమనే గజ్జల సవ్వడితో చిన్నారులు ప్రదర్శించిన నాట్యాంశాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. శనివారం రాత్రి 7.30 గంటలకు గద్వాల బాలభవన్‌లో వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులలో అంతర్గతంగా దాగిఉన్న ప్రతిభను ప్రోత్సహించాలని, అప్పుడే వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి ఉపశమనం పొందేందుకు సాంప్రదాయ కళలు, నృత్యాలు పరిపూర్ణంగా దోహద పడతాయన్నారు. సమాజాన్ని చైతన్య పర్చేలా సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరిండెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

అప్పులబాధతో ఆర్‌ఎంపీ బలవన్మరణం


రాజు (ఫైల్)

గద్వాల రూరల్: అప్పులబాధ తాళలేక ఓ ఆర్‌ఎంపీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నెలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన రాజు (30) గువ్వలదిన్నెలో నివాసముంటూ ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అప్పులు అధికమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో మే 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూడు కార్లు ఢీ : ఒకరి దుర్మరణం

- నలుగురికి గాయాలు


బాదం పాండుశెట్టి (ఫైల్)

పెబ్బేరు రూరల్: మూడు కార్లు ఢీకొని ఒకరు మృతిచెందగా.. మరో నలుగురికి గాయాలైనట్లు ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గద్వాలకు చెందిన నిఖిల్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, రమేష్ శనివారం సాయంత్రం హైదరాబాద్ వైపు నుంచి కారులో గద్వాలకు బయలుదేరారు. పెబ్బేరు మండలం రంగాపురం శివారులోని సందర్శిని రెస్టారెంట్ దగ్గరకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని హైదరాబాద్ వైపు వెళ్లే రహదారిపైకి వచ్చింది. ఈ ప్రమాదంలో మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. కారులో ప్రయాణిస్తున్న వనపర్తికి చెందిన బాదం పాండుశెట్టి (55) అక్కడికక్కడే మృతిచెందగా.. మాజీ కౌన్సిలర్ ఆవుల రమేష్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలు కావడంతో వెంటనే హైవే అంబులెన్స్‌లో వనపర్తి ఆసుపత్రికి తరలించారు. పాండుశెట్టి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నీటి గుంతలో పడి వృద్ధురాలు మృతి

నవాబుపేట: ఇంటి ఎదుట ఉన్న నీటి గుంతలో పడి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలోని కొండాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోచమ్మ (85) తెల్లవారుజామున నిద్రలేచి బయటికి బయలుదేరింది. కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఇంటి ముందున్న నీటి సంపులో పడిపోయింది. కుటుంబసభ్యులు నిద్రలేచాక చూసి బయటకు తీయగా అప్పటికే మృతిచెందింది.

ఫైర్‌మేన్ ఆత్మహత్యాయత్నం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా అగ్నిమాపక శాఖలో పనిచేసే ఓ ఫైర్‌మేన్ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లికి చెందిన రాజేష్ మహబూబ్‌నగర్ అగ్నిమాపక శాఖలో ఫైర్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మే 13వ తేదీ నుంచి పాలమూరు యూనివర్సిటీలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్‌రూం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా హుస్సేన్‌సాగర్‌లో నిర్వహించే బోటింగ్ వద్ద విధులు కేటాయించినట్లు తెలుస్తోంది. తనకు ఈత రాకపోయినా బోటింగ్ విధులు కేటాయించారని మనస్తాపానికి గురైన అతడు.. శనివారం డ్యూటీలోనే పురుగు మందు తాగాడు. గమనించిన తోటి సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఫెడరేషన్ క్రీడల్లో వనజారెడ్డికి బంగారు పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో గత నెలలో పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ క్రీడల్లో జిల్లాకు చెందిన ఏఎస్‌ఐ గోటూరు వనజారెడ్డి ప్రతిభచాటి పతకాలు సాధించారు. 45+ ఏళ్ల విభాగంలో వనజారెడ్డి లాంగ్‌జంప్, హైజంప్, 800 మీటర్ల పరుగులో మూడు పతకాలు సాధించారు. ఈ మేరకు శనివారం వనజారెడ్డిని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ అజీజుద్దీన్, వన్‌టౌన్ సీఐ అప్పయ్య అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా సర్కారి కిస్తీ

- ఉత్సవాలకు పెద్దఎత్తున తరలొచ్చిన భక్తులు
- ప్రసాదం కోసం పోటీపడ్డ పహిల్వాన్లు


అలంపూర్ షాఅలీ దర్గా వద్ద భక్తుల సందడి

అలంపూర్/అలంపూర్ రూరల్: పట్టణంలో హజరత్ షాఅలీ పహిల్వాన్ ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సర్కారి పహిల్వాని కిస్తీ పోటీలు నిర్వహించారు. షాఅలీ పహిల్వాన్ ధడ్ ముబారక్ దర్గాల్లో నిర్వహించిన పెద్ద కిస్తీ పోటీలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కిస్తీలో వేసిన తబురుక్ (ప్రసాదం) కోసం పహిల్వాన్‌లు పోటీపడ్డారు. అంతకుముందు సర్ ముబారక్ దర్గా, ధడ్ ముబారక్ దర్గాలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కిస్తీ పోటీలను దర్గా అభివృద్ధి కమిటీ చైర్మన్ సయ్యద్ అహ్మద్ షా ఓవైసీ ఆధ్వర్యంలో ధడ్ ముబారక్ దర్గా వద్ద ప్రారంభించారు. సయ్యద్ ఖాదర్ బాషా ఇంటి నుంచి మేళతాళాలు, భాజా భజంత్రీలతో ఊరేగింపుగా ప్రసాదం ధడ్ ముబారక్ దర్గాకు చేరుకుంది. అక్కడ మత పెద్దలు సర్కారి కిస్తీ కోసం తెచ్చిన పలావ్ ప్రసాదాన్ని కిస్తీలో నింపగా.. ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా గులాం అఫ్జల్ బియాబానీ రిఫాయ్ అల్ ఖాద్రీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు వారు దర్గాను దర్శించుకున్నారు. అనంతరం ఉర్సు నిర్వాహకులు వారిని పూలమాల, శాలువాతో సత్కరించారు.

పోటాపోటీగా పెద్ద కిస్తీలు..

షాఅలీ పహిల్వాన్ దర్గాలో పెద్ద కిస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. సర్కారి కిస్తీ అనంతరం అక్బర్‌పేట, కట్టెలపేట, న్యూప్లాట్స్ కాలనీ, సింగవరం, కాశీపురం, ఇమాంపురం తదితర గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లలో ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గా ఆవరణలోని పురాతన రాతి కిస్తీ (పడవ ఆకారం)లో ప్రసాదాన్ని నింపగా.. పహిల్వాన్‌లు పోటీపడి భక్తులకు అందజేశారు. ఉర్సుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో వీధులన్నీ సందడిగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా వెలసిన మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు రద్దీగా కనిపించాయి. రంగుల రాట్నాల వద్ద పిల్లలు సందడి చేశారు.


కిస్తీలో పోటీపడుతున్న పహిల్వాన్‌లు


సర్కారి కిస్తీ వద్ద మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం దేవునిగుట్ట ఉత్తరాది మఠంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణం శనివారం కనులపండువగా జరిగింది. ఉదయం అర్చకులు పుణ్యాహవాచనం, కలశ స్థాపన పూజలు నిర్వహించారు. సాయంత్రం వేద మంత్రోచ్చారణల నడుమ శ్రీనివాస కల్యాణం జరిపించారు. గోవింద నామస్మరణతో ఉత్తరాది మఠం మార్మోగింది. కల్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం సందర్భంగా భక్తుల ప్రదర్శించిన అడుగుల భజన విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం లక్ష్మీవేంకటేశ్వర స్వామికి మహా పంచామృతాభిషేకం, బృహతి సహస్ర మహాయాగం, పూర్ణాహుతి, సత్యధ్యానాచార్య కట్టిచే ప్రచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మఠాధిపతి పండిత ఆనందాచార్యజోషి, రంగనాథాచార్య, రామకృష్ణాచార్య, జయతీర్థ చార్యా, జోషి సంతోషాచార్య, భీమాచారి, అనంతాచారి తదితరులు పాల్గొన్నారు.

శనైశ్వరుడికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: మండలంలోని నంది వడ్డెమాన్‌లో జ్యేష్ఠాదేవి సమేత శనైశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మొదటి పూజలు నిర్వహించి, భక్తులచే శనిదోష నివారణ పూజలు చేయించారు. అనంతరం శివాలయంలో శివుడికి రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు ఉమ్మయ్య, శాంతికుమార్ పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,012 అడుగులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,012 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని.. సమాంతర కాల్వ నుంచి 27 క్యూసెక్కుల వరద వస్తోందన్నారు. తాగునీటి అవసరాలకు జలాశయంలోని నిల్వ నీటి నుంచి రోజు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

మృతులందరిది ఒకే కుటుంబం


ఘటన స్థలంలో స్కార్పియో వాహనం

- ఎర్రవల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఘటన


మృతుల ఫైల్ ఫొటోలు

అలంపూర్: వివాహ వేడుకల్లో వారం రోజుల పాటు బంధుమిత్రులతో ఆనందంగా గడిపిన ఓ కుటుంబం శుక్రవారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారే. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన వెంకటేష్ కుటుంబం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని సైనిక్‌పురికాలనీలో నివాసం ఉంటోంది. వెంకటేష్ (37) డ్రైవర్‌గా, అతడి భార్య పుష్ప (33) సూపర్ మార్కెట్‌లో పని చేస్తుండేది. తల్లి లత (58) ఇంటి పనులు చూసుకుంటూ కాలం వెళ్లదీసేది. గత నెల 27న వెంకటేష్ బావమరిది (భార్య తమ్ముడు) బాలాజీ వివాహం ఆళ్లగడ్డలో ఉండటంతో కుటుంబమంతా కలిసి మే 24న ఆళ్లగడ్డకు వెళ్లింది. పెళ్లి తంతు ముగించుకొని శుక్రవారం సాయంత్రం 5.30 సమయంలో స్కార్పియో వాహనంలో హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఇటిక్యాల మండలం ఎర్రవల్లి సమీపంలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్, పుష్ప, లత, చెల్లి కుమారుడు ఆదిత్య (7) అక్కడికక్కడే మృతిచెందారు. వెంకటేష్ కుమార్తె తరుణి, కుమారుడు నందు, చెల్లి కవితకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణం కావచ్చని చెప్పారు. బావమరిది బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉలిక్కిపడ్డ ఉద్యోగులు

- విద్యుత్ శాఖలో కీలక పోస్టుల నుంచి తప్పుకొనే యోచన
- ఏసీబీ దాడుల్లో తప్పించుకున్న మరో ఇద్దరు అధికారులు?

వనపర్తి: ఏసీబీ దాడుల నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఒకేసారి ఇద్దరు జిల్లాస్థాయి అధికారులు, ఒక సెక్షన్‌లో పనిచేసే ఏఈ స్థాయి అధికారి ఏసీబీకి పట్టుబడటం కలకలంరేపింది. మరో ఇద్దరు అధికారులను సైతం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలని ఏసీబీ వలపన్నినా.. అదృష్టం బాగుండి వారు తప్పించుకున్నట్లు విద్యుత్‌శాఖ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. పనుల మంజూరు.. నిధుల విడుదల లాంటి కీలకమైన సెక్షన్లు, పోస్టులలో పనిచేసేందుకు ఉద్యోగులు జంకుతున్నట్లు సమాచారం. శుక్రవారం నాటి ఏసీబీ ట్రాఫ్ నుంచి తృటిలో తప్పించుకున్న మరో ఇద్దరు ఉద్యోగులు తమను లూప్‌లైన్‌లోని విధుల్లోకి పంపిస్తే బాగుంటుందని ఉద్యోగ సంఘం నాయకులతో శనివారం సమాలోచనలు చేసినట్లు తెలిసింది. ఇన్నాళ్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్టుగా బక్క రైతులను సైతం లంచం కోసం వేధించిన విద్యుత్‌శాఖ అధికారులతో పాటు జిల్లాలోని ఇతర శాఖల అధికారుల్లోనూ భయం నెలకొన్నట్లు తెలుస్తోంది. కాగా, ఒకే రైడ్‌లో ముగ్గురు కీలక అధికారులు ఏబీసీకి చిక్కడం వనపర్తి చరిత్రలో ఇదే మొదటిసారి కావడంతో చర్చనీయాంశంగా మారింది. ఏసీబీకి చిక్కిన వారిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచేందుకు శనివారం తెల్లవారుజామున విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కార్యాలయం నుంచి తరలించారు.

అంజన్న నామస్మరణతో మార్మోగిన బీచుపల్లి


ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీచుపల్లి శనివారం భక్తులతో కిక్కిరిసి ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా నెల రోజులపాటు జరిగే జాతర ఉత్సవాల్లో భాగంగా రెండో శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కృష్ణానదిలో స్నానాలాచరించి భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి ఆంజనేయస్వామికి దాసంగాలు సమర్పించారు. అనంతరం ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

విధులు పకడ్బందీగా నిర్వహించాలి


కౌంటింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): లోక్‌సభ నియోజకవర్గ కౌంటింగ్ ఎన్నికల నిబంధనలను అనుసరించి లెక్కింపు సిబ్బంది విధులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ సిబ్బంది విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, పీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి ఉదయం 6 గంటలకే రావాలన్నారు. లెక్కింపు సిబ్బంది గాని, ఏజెంట్లు గాని సెల్‌ఫోన్ ఉపయోగించరాదని సిబ్బందికి కావాల్సిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంటాయన్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ సిబ్బది శిక్షణలోనే అన్ని అంశాలు నేర్చుకోవాలన్నారు. అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు కౌంటింగ్ సిబ్బంది ఈవీఎం కౌంటింగ్ పద్ధతులను తప్పక అనుసరించాల్సి ఉందన్నారు. ఒక్కో కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తారని, ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ఇద్దరు సహాయకులు, ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని చెప్పారు. శిక్షణ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ సిబ్బంది వివరాలు తెలిపారు. శిక్షణలో 75 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 86 మంది సహాయకులు, 79 మంది మైక్రో అబ్జర్వర్లు, 12 మంది ట్యాబులేషన్ సిబ్బంది పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, డీఈఓ రవీందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన కౌంటింగ్ సిబ్బంది

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు



దోమలపెంట: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని శనివారం నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డిలు సతీ సమేతంగా సందర్శించారు. వారికి జలవిద్యుత్ కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, ఎస్‌ఈ (సివిల్)రవీంద్రకుమార్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసరెడ్డి, ఎంసీఆర్ డీఈ కృష్ణయ్య సాదరంగా ఆహ్వానించారు. కేంద్రంలో యూనిట్ల పనితీరు, మెయిన్ కంట్రోల్‌రూంలో విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ, ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.మోయిజ్, ఎంపీటీసీ మల్లికార్జున, గురువయ్య, కుమార్, సిరాజ్ పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన


శ్రీనివాస్‌రెడ్డి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న స్వాతి

అడ్డాకుల: తనను పెళ్లి చేసుకోవాలని ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళన చేసిన ఘటన మండలంలోని రాంచంద్రాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అదే కంపెనీలో పనిచేసే లంగర్‌హౌజ్‌కు చెందిన స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకోగా.. ఇటీవల మరో యువతితో శ్రీనివాస్‌రెడ్డి పెళ్లి నిశ్చయమైనట్లు తెలిసింది. దీంతో శుక్రవారం అడ్డాకులకు వచ్చిన స్వాతి అక్కడి నుంచి రాంచంద్రాపూర్‌కు ఆటోలో వెళ్తుండగా.. శ్రీనివాస్‌రెడ్డి మధ్యలోనే ఆపి కాసేపు మాట్లాడిన తర్వాత దగ్గరలోని గుట్టపైకి వెళ్లారు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో స్వాతి గ్రామంలోని అతడి ఇంటి వద్దకు వెళ్లి అక్కడే బైఠాయించింది. శనివారం తల్లి, సోదరుడు వచ్చి స్వాతితో కలిసి ఇంటి వద్ద దీక్ష చేపట్టగా వివిధ కులసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. రాత్రి వరకు శ్రీనివాస్‌రెడ్డి రాకపోవడంతో కులసంఘాల నాయకులు స్వాతిని అడ్డాకులకు తీసుకెళ్లారు.

నల్లబెల్లం పట్టివేత


పట్టుబడిన బెల్లం, పటిక

లింగాల: మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో నల్లబెల్లం, పటిక శనివారం పట్టుబడినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీశైలం వ్యవసాయ పొలంలో గడ్డివాము కింద నల్లబెల్లం, పటిక నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 25 సంచుల బెల్లం, 15 కిలోల పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకొని శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.